పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
నందిగామ మండలంలో రూ.2కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
హాజరైన జడ్పీ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, ఎంపీపీ

నందిగామలో ఎంపీడీవో భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్ పర్సన్

నందిగామ, జూన్ 28 : గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శుక్రవారం నందిగామ మండల కేంద్రంలో కోటి రూపాయలతో ఎంపీపీ ప్రియాంకగౌడ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎంపీడీవో భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.10లక్షలతో మహిళా సమాఖ్య భవనం, రూ.5లక్షలతో వంట గది పనులకు శంకుస్థాపన, మన ఊరు మన బడి ద్వారా మంజూరైన రూ.22లక్షలతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల అదనపు తరగతి గదుల ప్రారంభం, అంతిరెడ్డిగూడలో అంగన్‌వాడీ కేంద్రం, మహిళా సమాఖ్య భవనం ప్రారంభం, రూ.25లక్షలతో పంచాయతీ భవనం, సీసీ రోడ్డు పనులు, నర్సప్పగూడ, చేగూరులో సీసీ రోడ్డు పనులను జడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి, వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీపీ ప్రియాంకగౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, వైస్ ఎంపీపీ మంజుల, ఎంపీటీసీలు చంద్రపాల్ రెడ్డి, కొమ్ము కృష్ణ, కుమారస్వామిగౌడ్, లత, కళమ్మ, రాజూనాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాజ్‌గోపాల్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కడ్తాల్, జూన్ 28: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రత్యేక నిధులతో గ్రామాలు, తండాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మైసిగండి మైసమ్మతల్లి ఆలయ పరిసరాలలో సీడీపీ నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తామని తెలిపారు. గ్రామాలు, తండాల రూపురేఖలు మార్చడమే ధ్యేయంగా పనిచేస్తామని వివరించారు.

ఆలయంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు..
మైసిగండి మైసమ్మతల్లి ఆలయాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి–మాధవి దంపతులు దర్శించుకొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆలయ సిబ్బంది వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, ఎంపీడీవో సుజాత, ఎంపీవో తేజ్‌సింగ్, పీఆర్ ఏఈ పరమేశ్, మాజీ సర్పంచ్‌లు తులసీరాంనాయక్, శేఖర్‌గౌడ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, భీక్యానాయక్, నరేశ్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్య, జవహర్, శ్రీనునాయక్, సత్యం, బిక్కునాయక్, శంకర్, గోపి, మహేశ్ పాల్గొన్నారు.

మైసిగండి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

అతిథి అధ్యాపకుల పోస్టులకు

దరఖాస్తుల స్వీకరణ

చేవెళ్లటౌన్, జూన్ 28: చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తునట్లు కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్, జువాలజీ సబ్జెక్టుల్లో బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 50శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్, ఎస్‌ఈటీ, సెట్, తదితర అర్హతలు గలవారు జూలై 1వ తేదీ సాయంత్రం 5గంటలోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

విద్యార్థుల సౌకర్యార్థం అదనపు బస్ సర్వీసులు

బస్టాండ్‌ను పరిశీలించిన డిపో మేనేజర్

యాచారం, జూన్28: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకటనర్సప్ప శుక్రవారం సందర్శించారు. బస్టాండ్ పరిసరాలు, మూత్రశాలలు, మరుగుదొడ్లను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు కల్పించిన వసతులపై ఆరా తీశారు. కంట్రోలర్ యాదయ్యతో మాట్లాడి బస్టాండ్‌లో సమస్యలను, బస్సుల రాకపోకల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నేరుగా ఫోన్ చేసి బస్సు సౌకర్యాలపై ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతాలకు ఉదయం, సాయంత్రం ఉన్న బస్సుల జాబితాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాలకు చెందిన పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం అదనపు బస్సులను నడిపేందుకు కృషి చేస్తామన్నారు. బస్టాండ్‌లోని రెండు షెటర్లు, టూవీలర్ పార్కింగ్, టీ పాయింట్, పుట్‌వేర్ కోసం టెండర్లు వేసినట్లు తెలిపారు. బస్టాండ్‌లో ప్రైవేటు వాహనాలు నిలుపకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఆర్టీసీ బస్సు తప్పకుండా బస్టాండ్‌లోకి రావాలని సూచించారు. బస్టాండ్‌లో సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాలుగా కృషి చేయనున్నట్లు తెలిపారు.

యాచారం బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డిపో మేనేజర్ వెంకటనర్సప్ప

కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ప్రారంభించండి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి జడ్పీటీసీ వినతి

కడ్తాల్, జూన్ 28: మండల కేంద్రం సమీపంలో చేపట్టిన కస్తూర్బా గాంధీ పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి కావడంతో, భవనాన్ని వెంటనే ప్రారంభించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యేని జడ్పీటీసీ కలిసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పాఠశాల ప్రారంభంకాలేదని అక్కడి అధికారులు తెలుపుతుండటంతో, తప్పని పరిస్థితుల్లో విద్యార్థులు వేరే మండలాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. వెంటనే కేజీబీపీ భవనాన్ని ప్రారంభించి తరగతులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేని ఆయన కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత..
మండలంలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన మూడావత్ సూర్తి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ శుక్రవారం సాయంత్రం స్థానిక నాయకులతో ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రాధాకృష్ణ ట్రస్ట్ తరుపున జడ్పీటీసీ రూ.5 వేలు, ఎంపీటీసీ ప్రియ రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భారతమ్మ, నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌నాయక్, వెంకటేశ్, నరేశ్‌నాయక్, భీక్యానాయక్, పంతూ నాయక్, నర్సింహగౌడ్, జైపాల్, గోపాల్, పాండు, దేవూజా, కిషన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు

అంతరాయం

యాచారం, జూన్28: విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా నేడు మండలంలోని నందివనపర్తి 11కేవీ ఫీడర్ పరిధిలో ఉన్న అగ్రికల్చర్‌కు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ సందీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందివనపర్తి, బొల్లిగుట్టతండా రైతులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలి

మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, దాత మాధవి

షాబాద్, జూన్ 28: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలని మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ ఉన్నత పాఠశాలలో అదే పాఠశాలకు చెందిన వల్లభనేని మాధవి ఉపాధ్యాయురాలు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ గ్రేడులు సాధించిన 11 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 13 మంది విద్యార్థులకు రూ.5వేల చొప్పున ప్రతిభా అవార్డులను ఎమ్మెల్సీ, ఎంపీపీతో కలిసి ఆమె అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహిస్తే మరింత ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని చెప్పారు. ప్రైవేటుకు దీటుగా విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్‌రాథోడ్, మండల నోడల్ ఆఫీసర్ లక్ష్మణ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వసంత, రాజ పాల్‌సింగ్, యామిని, గోవింద్, బసప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, అంజయ్య, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కడ్మూరి సుదర్శన్, కృష్ణ, గౌరవ అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యాయులు సుదర్శన్, రవీందర్ రెడ్డి, సునీత, గణేశ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రజియాబేగం, సీఆర్పీలు లింగం, దుర్గేశ్ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు సామగ్రి అందజేత

షాద్‌నగర్‌టౌన్, జూన్ 28: షాద్‌నగర్ మున్సిపాలిటీ 5వ వార్డు సోలిపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి సహకారంతో నూతన గ్యాస్ స్టవ్, సిలిండర్‌ను శుక్రవారం అందజేసినట్లు బీఆర్ఎస్ నాయకుడు చీపిరి రమేశ్‌యాదవ్ తెలిపారు. ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలనే ఉద్దేశంతో వీటిని అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్‌గౌడ్, వెంకటేశ్, ప్రవీణ్, నర్సింహ, పవన్, శేఖర్, పురుషోత్తం పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రిని అందజేస్తున్న నాయకులు

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందుతుంది

షాబాద్ ఎంపీడీవో అపర్ణ, సహకార సంఘం మాజీ చైర్మన్ ఈదుల నర్సింహులుగౌడ్

గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో అపర్ణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహులుగౌడ్, కంపెనీ ప్రతినిధులు

షాబాద్, జూన్ 28: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు, యువకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని షాబాద్ ఎంపీడీవో అపర్ణ, సహకార సంఘం మాజీ చైర్మన్ ఈదుల నర్సింహులుగౌడ్ అన్నారు. షాబాద్ మండలంలోని నాగరగూడ గ్రామంలో అమెజాన్ వెబ్ సర్వీస్ వారి సహకారంతో సెర్చ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణం చేసిన గ్రంథాలయాన్ని కంపెనీ ప్రతినిధి శంకరన్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి ప్రపంచంలో చదువుకుంటేనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. గ్రామాల్లో గ్రంథాలయాల్లోని పుస్తకాలతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నూతన గ్రంథాలయంలో అన్ని వసతులతో కూడిన ఫర్నిచర్, బుక్స్ ర్యాక్, కంప్యూటర్ తదితర వసతులు కల్పించిన కంపెనీ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుత్తి సునీత, గ్రామ ప్రత్యేకాధికారి శారద, మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్, పంచాయతీ కార్యదర్శి అజీమ్, కంపెనీ ప్రతినిధులు, గ్రామస్తులు సుధాకర్ గౌడ్, అబేద్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం వెంటనే పూర్తిచేయాలి

బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా

ధర్నా నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులు

ఇబ్రహీంపట్నం, జూన్ 28 : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన వంతెన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వంతెన నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం వంతెన వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్ హాజరై మాట్లాడుతూ.. అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన నిర్మాణంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వంతెన నిర్మాణ పనులు పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్‌గౌడ్, జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు బూడిద నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీశైలం, శబ్బూంతికుమార్, ఐలేశ్, మహేశ్, శేఖర్‌రెడ్డి, వినయ్, నర్సింహారెడ్డి, తదితరులున్నారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 28 : మండల పరిధిలోని పోల్కంపల్లి–రాయపోల్ గ్రామాలను కలుపుతూ ఉన్న ప్రధాన రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిన వాహనదారులు ప్రయాణాలు కొనసాగలేని స్థితిలో ఉన్నందున ఈ రోడ్డును వెంటనే మరమ్మతు పనులు చేయించేందుకు కృషిచేయాలని కోరుతూ.. శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎంపీడీవో వెంకటమ్మకు సీపీఎంపార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భిక్షపతి, రవి, జగన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలి

షాద్‌నగర్‌టౌన్, జూన్ 28: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలని షాద్‌నగర్ యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధిక ఫీజులను నియంత్రించాలంటూ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో శుక్రవారం దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని ఆరోపించారు. పాఠశాలల యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

సమాజసేవలో భాగస్వాములు కావాలి

రోడ్డు పైన పడిన గుంతలను పూడ్చి వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్లటౌన్, జూన్ 28: సమాజసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఆసిఫ్ అన్నారు. శుక్రవారం చేవెళ్ల నుంచి ఊరేళ్లకు వెళ్లే దారిలో బ్రిడ్జి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను సొంత డబ్బులతో ఆసిఫ్ స్థానికులతో కలిసి సిమెంట్, కంకరతో పూడ్చివేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 28: ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ కోర్సు మూడో సెమిస్టర్ మెయిన్, మొదటి సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, రెండో సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు మెమోలను మూడు వారాల తర్వాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, వచ్చే నెల 4 లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుంతో వచ్చే 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 4 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూసుకోవచ్చన్నారు.

బీఈడీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బీఈడీ కోర్సు పరీక్షా ఫీజు ను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ కోర్సు నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును వచ్చే నెల 22 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుంతో 25 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఆగస్టు, సెప్టెంబర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. వివరాలకు వెబ్‌సైట్ www. osmani a.ac.inలో చూసుకోవచ్చన్నారు.

ఎంసీఏ పరీక్షా ఫలితాలు విడుదల

ఓయూ పరిధిలోని ఎంసీఏ కోర్సు పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్) (రెండేండ్ల కోర్సు) సెమిస్టర్, ఎంసీఏ (సీడీఈ) (సీబీసీఎస్) రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఫలితాల కోసం www. osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఆర్కేపురం, జూన్ 28 : సరూర్‌నగర్ డివిజన్‌లోని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ పేర్కొన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా లక్ష్మీనగర్ కాలనీలో డీసీ సుజాతతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం పోయేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలనీల్లో ఎటువంటి సమస్యలు ఉన్నాగాని ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అవసరం ఉన్న ప్రతి కాలనీలో దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

సీసీ కెమెరాలను అందజేస్తున్న ఎంపీపీ కృపేశ్ తదితరులు

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 28 : నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు ఎంతో దోహదం చేస్తాయని ఇబ్రహీంపట్నం మండల పరిషత్ అధ్యక్షుడు కృపేశ్ అన్నారు. శుక్రవారం పోచారం గ్రామంలో మురళీధర్ అనే వ్యక్తి సహకారంతో గ్రామంలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..గ్రామంలో దొంగతనాలు, నేరాలతో పాటు ఇతర ఆగడాలు అరికట్టడం కోసమే సీసీకెమెరాలను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎస్సై మారయ్య, పంచాయతీ కార్యదర్శి లింగయ్య ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

15 తులాల బంగారం అపహరణ

మొయినాబాద్, జూన్28: తాళం వేసిన ఇంట్లో దుండగులు బంగారు ఆభరణాలు, నగదును చోరీ చేసిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్‌లోని ముస్తాఫాహిల్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఆసియా సుల్తానా ఇంటికి తాళం వేసి ముంబాయిలో తమ బంధువుల ఇంటికి వెళ్లింది. దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న 15 తులాల బంగారం, కొంత నగదును అపహరించారు. కాగా, గురువారం సాయంత్రం ఇంటి తలుపులు తెరిచి ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఇంటి పక్కనే ఉండే ఓ మహిళ ముంబాయి వెళ్లిన ఆసియా సుల్తానాకు సమాచారం అందించింది. బండ్లగూడలో నివాసం ఉండే ఆమె బంధువు అబ్దుల్ ఖుద్దీస్‌కు కాల్ చేసి చోరీ జరిగినట్లు తెలిపింది. అతను వెంటనే గురువారం రాత్రి ముస్తాఫా హిల్స్‌కు చేరుకుని చూడగా ఇంట్లో చోరీ జరిగినట్లు సుల్తానాకు చెప్పాడు. ముంబాయి నుంచి రాలేని పరిస్థితిలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని అబ్దుల్ ఖుద్దీస్‌కు చెప్పడంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలి

బండ్లగూడ, జూన్ 28: హిమయాత్‌సాగర్ గ్రామంలోని శ్మశానవాటికకు రోడ్డును ఏర్పాటు చేయాలని కమిషనర్ శరత్‌చంద్రకు కార్పొరేటర్లు ముద్దం రాము, అస్లాబిన్ అబ్దుల్లా శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 7లో శ్మశానవాటిక ఉందని, ఎవరైనా చనిపోతే శవాన్ని అక్కడికి తీసువెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇతరుల పట్టా పొలం నుంచి తీసుకువెళ్లాంటే వారితో అనేక ఇబ్బందులు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంలో రోడ్డు వేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకొని త్వరిత గతిన రోడ్డు వేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

బండ్లగూడ: గండిపేట మండలం కిస్మత్‌పూర్ గ్రామంలో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి గ్రామ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు గ్రామస్తులు పవన్, సాయి వివరించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ స్వప్న, చిత్రంలో వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి

పెద్దఅంబర్‌పేట, జూన్ 28: మున్సిపాలిటీ అభివృద్ధికి అన్నివిధాల కృషి చేస్తున్నట్టు చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో స్వప్న అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. 46 అంశాలకుగాను 44 అంశాలను ఆమోదించారు. అదనంగా మరో రెండు అంశాలకు సైతం కౌన్సిల్ ఆమోదం తెలిపినట్టు స్వప్న తెలిపారు. అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చామ సం